TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 256 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ ఆదివారం.12.04.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## అమీన్‌పూర్‌లో హైడ్రా కూల్చివేతలు..

అమీన్‌పూర్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ శివారులోని ప్రభుత్వ భూములను కాపాడేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా) మరోసారి రంగంలోకి దిగింది. శనివారం ఉదయం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో భారీ కూల్చివేతలకు శ్రీకారం చుట్టింది. సుమారు 2,000 మంది రెవెన్యూ, హైడ్రా సిబ్బంది, 1,000 మందికి పైగా పోలీసుల బందోబస్తు మధ్య ఈ మెగా ఆపరేషన్ కొనసాగుతోంది. ఐలాపూర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని అధికారులు భారీ యంత్రాలతో నేలమట్టం చేశారు. దీనితో పాటు 1998 నుంచి కోర్టు స్టే ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన న్యాయవాది ముఖీంకు చెందిన గెస్ట్ హౌస్‌ను కూడా అధికారులు కూల్చివేశారు. ఈ ఆపరేషన్‌తో కబ్జాదారుల గుండెల్లో వణుకు పుట్టింది. మరోవైపు, కిష్టారెడ్డిపేటలోని కేఏ రెసిడెన్సీ, క్రిస్టల్ డెవలపర్స్ భవనాల్లో నివసిస్తున్న 45 కుటుంబాలను అధికారులు ఖాళీ చేయించారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తమను బలవంతంగా బయటకు పంపుతున్నారని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయంపై హైడ్రా కమిషనర్



రంగనాథ్ స్పందిస్తూ, పేదలు నివసించే ఇళ్లను తాము లక్ష్యంగా చేసుకోలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను భారీగా ఆక్రమించి నిర్మించిన వాణిజ్య, పెద్ద కట్టడాలపైనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే : కెటిఆర్

ఇబ్రహీంపట్నం (తెలంగాణ) :అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో మంచి పాలన అందించాల్సిన అవసరముందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ అన్నారు. రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంతవరకు రైతులకు రుణమాఫీ డబ్బులు ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని ఎంత వరకు అమలు చేసిందని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లారో.. ఎందుకు వెళుతున్నారో ప్రజలకు తెలుసునన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలు అన్నీ ఇన్నీ కాదు అని చెప్పారు. యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని ఊరించి.. గద్దెనెక్కి గడిచిన రెండున్నరేళ్లలో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు అని తెలిపారు. స్కూటీలు, నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి మహిళలను కూడా మోసం చేశారని ఆరోపించారు. రెండు నెలల పింఛను ఇవ్వకుండా




వఅద్ధులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిందన్నారు. గడిచిన 28 నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన అభివఅద్ధి ఏమీ లేదు అని కెటిఆర్ ధ్వజమెత్తారు.

## కదంతొక్కిన రైతన్నలు -- ప్రైవేటు సైన్యాన్ని పరుగులెత్తించారు ...!

అమృత్ తెలంగాణ: నాదర్‌గుల్ రైతులు కదంతొక్కారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు దూరమై భూపోరాటానికి దిగిన రైతు కుటుంబాలు.. మరోసారి తమ భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ సైన్యంపై విరుచుకుపడ్డారు. ఆ కంపెనీలు వేసిన రేకుల కంచెను దాటుకొని, పోలీసులు, బౌన్సర్లను సైతం లెక్క చేయకుండా భూముల్లోకి చొచ్చుకొని వెళ్లారు. ఈ అనూహ్య పరిణామాలతో అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌ను తీసుకొని లోపలికి పోయేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్ గేటు వద్దే నిలువరించారు. చాలాసేపు వాగ్వాదం చేసిన తర్వాత గేటు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తాళ్లు పట్టుకొని గేటుకు అడ్డుగా రక్షణ వలయంగా నిల్చున్నా రైతులు లెక్క చేయలేదు. ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ ముందుకు తోసుకుంటూ వెళ్లారు. లోపలి వైపు ప్రైవేట్ సైన్యం గేటును అదిమిపట్టినా రైతులు పట్టువీడకపోవడంతో ఒక్కసారిగా గేటు తెరుచుకుంది. దీంతో పదుల సంఖ్యలో రైతులు లోపలికి వెళ్లి బౌన్సర్లను తరిమికొట్టారు. ఒకేసారి పెద్ద ఎత్తున రైతులు రావడంతో బౌన్సర్లు భయంతో భూముల్లోకి పరుగులు తీశారు. రెండేండ్లుగా తమను తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బౌన్సర్లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని పరుగులెత్తించారు. ఈ క్రమంలో కొంతమంది బౌన్సర్లు గుంతల్లో పడిపోగా మరికొందరిని రైతులు పట్టుకొని దాడి చేసేందుకు ప్రయత్నించడంతో




పరిస్థితి గందరగోళంగా మారింది. అయితే ఎవరిపైనా దాడులు చేయొద్దని విశారదన్ మహరాజ్ వచ్చి రైతుల్ని వారించి, బౌన్సర్లను అక్కడినుంచి పంపించారు. ఆ తర్వాత రైతులు భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలు ధ్వంసం చేసిన బోర్లను, బావులను పూడ్చిన తీరును విశారదన్ మహరాజ్‌కు చూపించారు. పొలాల కోసం వేసుకున్న పైపులను కూడా ధ్వంసం చేశారని, కాలువలను లేకుండా చేశారని, కరెంటు వైర్లను తగులబెట్టారని రైతులు వాటిని చూపుతూ ఆవేదన చెందారు. చాలాకాలం తర్వాత పొలాల్లోకి వెళ్లినందుకు రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు.

## నూర్జహాన్ మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటు: సీఐటీయూ

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: సీఐటీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నూర్జహాన్ (43) అనారోగ్యంతో నిజామాబాద్ పట్టణంలోని వెల్నెస్ హాస్పిటల్లో శుక్రవారం సాయంత్రం 4-20 ని.లకు ఊపిరితిత్తుల సమస్య, గుండెపోటుతో మృతి చెందారు. నూర్జహాన్ మరణం కార్మిక, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు. నూర్జహాన్ మృతి పట్ల సీఐటీయూ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. ఈరోజు మరణవార్త తెలిసిన అనంతరం సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో కామ్రేడ్ నూర్జహాన్ సంతాప సభ నిర్వహించి అమరజీవి చిత్రపటానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్లతో పాటు రాష్ట్ర ఆఫీస్ బేరర్స్, రాష్ట్ర కమిటీ సభ్యులు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సంతాప సభలో చుక్క రాములు, పాలడుగు భాస్కర్లు మాట్లాడుతూ.. నూర్జహాన్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకురాలు, జిల్లాలో బీడీ కార్మికులు, అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామ పంచాయితీ, మున్సిపల్, ఎలక్ట్రిసిటీ, మిషన్ భగీరథ తదితర కార్మికుల సమస్యల పరిష్కారానికై



పోరాటాలు సమరశీలంగా నడిపిన మిలిటెంట్ నాయకురాలు. అన్నిరకాల కార్మికులను ఐక్యంగా సంఘటితం చేయడంలో నూర్జహాన్ పాత్ర మరువలేనిది. ఆమె కార్మిక హక్కులు, రక్షణ కోసం అనేక ఉద్యమాలు నడిపింది. నూర్జహాన్ మరణం నిజామాబాద్ జిల్లా కార్మికవర్గానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. నిజామాబాద్ ట్రేడ్ యూనియన్, ప్రజాతంత్ర ఉద్యమాల నిర్మాణంలో కామ్రేడ్ నూర్జహాన్ ముఖ్యమైన పాత్ర నిర్వహించారు.

## నేడు మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి : ప్రధాని, రాష్ట్రపతి నివాళులు



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: నేడు సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్‌పూలే 200వ జయంతి. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములు నివాళులర్పించారు. శనివారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీతో కలిసి పార్లమెంటు ప్రాంగణంలోని ప్రేరణా స్థల్ వద్ద మహాత్మా జ్యోతారావ్ పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ నివాళి కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, జెపి నడ్డా, మాజీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌లు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా 'సమానత్వం, న్యాయం, విద్య అనే ఆదర్శాలకు తన జీవితాన్ని అంకితం చేసిన దార్శనిక సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తున్నాను. ఆయన మహిళలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణలో మార్గదర్శకుడు. అతని కృషి వల్ల, విద్య సాధికారతకు ఒక శక్తివంతమైన సాధనంగా మారింది. ఈ సంవత్సరం మనం ఆయన 200వ జయంతి ఉత్సవాలను ప్రారంభిస్తున్నాము. సామాజిక ప్రగతి సాధనలో ఆయన ఆలోచనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని ఆశిస్తున్నాము' అని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## 20న మోతిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ



హైదరాబాద్: అమృత్ తెలంగాణ:జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా సభాస్థలని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 20న మోతెలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉండబోతుందని తెలిపారు. లక్షకు పైగా జనాభాకు అనుగుణంగా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

## సింగర్ మంగ్లీపై కేసు నమోదు



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నారు సింగర్ మంగ్లీ. ఆ తర్వాత సినిమాల్లో వరుస పాటలతో మరింత పాపులారిటీ దక్కింది. తాజాగా సింగర్ మంగ్లీపై కేసు నమోదైంది. ఆమెతోపాటు తన సోదరుడు శివపై కూడా పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. మంగ్లీ తనను మోసం చేసిందని.. ఆమె వల్ల తనకు ప్రాణహాని ఉందని ఓ న్యాయవాది ఆరోపించారు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు మంగ్లీ, ఆమె సోదరుడితోపాటు మరో ముగ్గురిపై బీఎన్ఎస్ సెక్షన్ 351 (2), 352 కింద కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం .... మంగ్లీ, ఆమె సోదరుడు శివ, మరికొంతమంది కలిసి సుమారు 100 మంది నుంచి భారీగా నిధులు వసూలు చేశారని.. వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని నమ్మించి ఈ డబ్బు తీసుకున్నట్లు ఆరోపించారు. అయితే కాలం గడుస్తున్నప్పటికీ లాభాలు ఇవ్వకపోగా.. అసలు డబ్బు తిరిగి ఇవ్వలేదని బాధితుడు ఆరోపించారు. తనకు ఫోన్ చేసి మంగ్లీ, ఆమె సోదరుడు శివ బెదిరింపులకు పాల్పడినట్టు పంజాగుట్ట పిఎస్ లో ఫిర్యాదులో వెల్లడించారు న్యాయవాది సుబ్బరావు. తనను యాక్సిడెంట్ చేసి చంపుతానని మంగ్లీ , ఆమె సోదరుడు బెదిరించినట్టు పోలీసులకు తెలిపారు. తనకు వీరితో ప్రాణ హాని ఉందని పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఈ కేసులో ఏ 5 గా మంగ్లీ, మిగతా నిందితుల పై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

# నిర్మల్‌లో ఘనంగా 'వారసత్వ సంబురాలు'..ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఎఎస్ పార్థసారథి హాజరు..





మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పార్థసారథి

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 11 నిర్మల్ పట్టణంలోని సిటీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం 'వారసత్వ సంబురాలు' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, వైద్య వృత్తి, సంస్కృతి, సాంప్రదాయాలపై జిల్లా రచయితలు రచించిన పలు పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. జిల్లాలో రచయితలు విశేషంగా సాహిత్య సృష్టి చేస్తున్నారని, ముఖ్యంగా మహిళా రచయితలు ముందుకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం వైద్యులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా వైద్యులు, కార్యక్రమ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్డీవో



నిర్మల్ జిల్లా ఏప్రిల్ 11 అమృత్ తెలంగాణ నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రత్న కళ్యాణి మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని కొనియాడారు. ఆయన చూపిన మార్గాన్ని అందరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, డీఈవో భోజన్న, అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణ సమాజ బాధ్యత : జిల్లా కలెక్టర్ రాజర్షి షా








సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో ఔషధ నియంత్రణ, హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ వినియోగంపై స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి రిమ్స్ ఆడిటోరియం వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి పాల్గొన్నారు. అనంతరం రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో డ్రగ్స్ నియంత్రణ అత్యంత ముఖ్యమైన అంశమని,ముఖ్యంగా 'అల్ప్రాజోలం' వంటి ప్రమాదకరమైన హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ విషయంలో కెమిస్ట్‌లు, ఫార్మసిస్ట్‌లు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇటువంటి మందులను విక్రయించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నపాటి జలుబు, దగ్గుకు నేరుగా యాంటీబయాటిక్స్ వాడకూడదని, షెడ్యూల్ హెచ్, హెచ్1 మందులను డాక్టర్ల సలహా మేరకే తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఏ మందులు పని చేయని పరిస్థితి వస్తుందని వివరించారు. రిమ్స్, మెడికల్ కళాశాల ప్రాంగణాల్లో సింథటిక్ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగంపై నిఘా ఉంచాలని హెచ్ఓడీలను ఆదేశించారు.

మత్తుకు బానిసైన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు డీ–అడిక్షన్ సెంటర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. అత్యధిక మోతాదులో మందులు వాడటం వల్ల కిడ్నీలు, లివర్ వంటి అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని కోరారు. మందుల దుకాణాల్లో క్యూఆర్ కోడ్ విధానం ద్వారా మందుల దుష్ప్రభావాలను తెలుసుకునేలా వినియోగదారులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఔషధ నియంత్రణపై వైద్యులు, ఔషద షాపుల యజమానులతో ప్రతిజ్ఞ చేయించి, సంబంధిత పోస్టర్ లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్రీలత, ఎస్ఐ సందీప్, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# శుభకార్లలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన పలు వివాహాది శుభకార్యాలకు కుటుంబ సభ్యులతో

కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి అభినందనలు తెలిపిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి వారివెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# అంబేద్కర్ విగ్రహం ముందరి భాగం లోనీ తోపుడు బండ్ల నీ తొలగించండి

నిర్మల్ ఏప్రిల్ 11. అమృత్ తెలంగాణ శనివారం రోజు నిర్మల్ జిల్లా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల రంజిత్ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణం లోనీ ట్యాంక్ బండ్ వద్ద గల డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు భాగంలో అక్రమంగా ఏర్పాటు చేసిన మిర్చి బండి, కురకాయలు మరియు పాన్ పరాక్ వంటి తోపుడు బండ్లనీ తొలగించి పరిసరాలని పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పట్టణ పోలీసు స్టేషన్ లో వినతి పత్రం అందజేశారు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి 24 గంటలలో అంబేద్కర్ విగ్రహం ముందు గల తోపుడు బండ్ల నీ తొలగించకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు జిల్లా ఉపాధ్యక్షులు ఈరోల పురుషోత్తం తదితరులు ఉన్నారు



పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందజేసిన దళిత సంఘ నాయకులు

# 13 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం.. గిరిజన రైతులకు పట్టాల పంపిణీ..



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్సిబి తండాకు చెందిన గిరిజన రైతుల 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా చొరవతో సమస్యను వేగంగా పరిష్కరించి, రైతులకు భూ పట్టాలు అందజేశారు. ఫారెస్ట్, రెవెన్యూ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, సర్వే నంబర్లలో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా పల్సిబి తండాకు చెందిన సుమారు 9 మంది ఎస్టీ రైతులు దశాబ్దకాలంగా పట్టాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలో కూడా వారు వెనుకబడ్డారు. రైతులు తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగానే, ఆయన వెంటనే స్పందించి సీసీఎల్ఏ అధికారులతో సమన్వయం చేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యవేక్షణలో రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టి సమస్యను కొలిక్కి తెచ్చింది. ఈ పరిష్కారంలో భాగంగా మొత్తం 30 ఎకరాల భూమిని అర్హులైన రైతులకు కేటాయించారు. 9 మంది రైతులకు వారి సాగు విస్తీర్ణం ఆధారంగా 2 నుండి 3 ఎకరాల వరకు పట్టాలు కలెక్టర్ స్వయంగా అందజేశారు. పట్టాలు అందుకున్న రైతులు శనివారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆనందం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తమ దీర్ఘకాల సమస్యను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంఆర్ఓ రాజ్‌మోహన్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశలు..పాల్గొన్న ముధోల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి..



ఇందిరమ్మ గృహప్రవేశంలో దంపతులను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి

నిర్మల్ జిల్లా ముధోల్ ఎడ్బిడ్ ఏప్రిల్ 11 అమృత్ తెలంగాణ ముధోల్ మండలంలోని ఎడ్బిడ్ గ్రామంలో కందారి సంధ్య మాణిక్, ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ముధోల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి, పాల్గొనడం జరిగింది. పేదవారి సొంతింటి కలలను నిజం చేసే ఏకైక ప్రభుత్వం మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని అన్నారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరామ్మా ఇండ్లను మంజూరు చేయడం జరిగింది అని అన్నారు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, లక్ష్యం పేదవారి సొంత ఇంటి కలను నిజం చేయడమే అని అన్నారు. ముధోల్ నియోజకవర్గం లో ఇందిరామ్మా ఇండ్లను మంజూరు చేసినందుకు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,కి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బెజ్జంకి సాయరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, గౌతమ్, కృష్ణారెడ్డి, మధు గౌడ్, పాల్గొన్నారు

# అంబేద్కర్ జయంతి మరియు బౌద్ధ జయంతికి భారీ సంఖ్యలో పాల్గొనీ విజయవంతం చేయండి. దుర్గం ట్రస్ట్ చైర్మన్ శేఖర్ పిలుపు



కార్యక్రమం నిర్వహికులకు పది వేయిల రూపాయ చెక్ అందిస్తున్న దుర్గం శేఖర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ శనివారం ఆదిలాబాద్ పట్టణంలో దుర్గం ట్రస్ట్ కార్యాలయంలో బౌద్ధ పూర్ణిమ ( వైశాఖ పూర్ణిమ ) మరియు డా. బి. ఆర్. అంబేద్కర్ జయంతులు తేదీ. 01.05.2026 రోజున ఆదిలాబాద్ పట్టణం కైలాష్ నగర్ అశోక బుద్ధ విహార్ యందు ఘనంగా నిర్వహించడానికి గోడ ప్రతులు దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ చే ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మహనీయుల జయంతులకు వేలాది సంఖ్యలో బౌద్ధ ఉపాసకులు మరియు అంబేద్కర్ వాదులు హాజరై జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. తర్వాత దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ కార్యక్రమం నిర్వహికులకు పదివేల రూపాయల చెక్ ను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మరియు భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులకు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో భారతీయ బుద్ధ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞా కుమార్ , జిల్లా అధ్యక్షులు విట్టల్ బుట్టే ,

ప్రధాన కార్యదర్శి దయానంద్ పాటఫోడే , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భీమ్ రావు వాగ్మారే , జిల్లా జనరల్ సెక్రటరీ దదసాహెబ్ జబడే తో పాటు దయానంద్ కామ్లే , కాంతారావు వాగ్మారే , రంగారావు వాటోరే , గోవింద్. రఘనాథ్ ఆడే. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలు




నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ మరియు బిసి ఎస్సి ఎస్టి కుల సంఘ నాయకులు




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారం. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి కార్యక్రమానికి ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు ఆహ్వానితులను అలరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలోని అసమానతలను గుర్తించి, వాటి నిర్మూలనకు కృషి చేసిన గొప్ప సంస్కర్త జ్యోతిబా పూలే అని కొనియాడారు. విద్య ద్వారానే అంటరానితనం, స్త్రీ పురుష అసమానతలు తొలగిపోతాయని నమ్మిన ఆయన, తన భార్య సావిత్రిబాయి పూలేను విద్యావంతురాలిని చేసి దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలిని చేశారని గుర్తు చేశారు. వారి కృషి ఫలితంగానే నేడు భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు విద్య మరియు రిజర్వేషన్ల రూపంలో అనేక ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్ ఫోన్లు, మత్తు పదార్థాల వంటి అనవసరమైన ఆకర్షణలకు లోనుకాకుండా తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరుతూ, జైనద్ లో సుమారు 20 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన జ్యోతిబా పూలే పాఠశాల భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారని, విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను సైతం పెంచడం జరిగిందని వివరించారు. మహనీయుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ, సుమారు రెండు వందల ఏళ్ల క్రితం, దేశానికి స్వాతంత్ర్యం రాకముందే సామాజిక అస్పృశ్యతను ఎదురించి, పేద వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషిని కొనియాడారు. విద్య అనేది కేవలం కొందరికే పరిమితమైన ఆ రోజుల్లో, ప్రతి ఒక్కరికీ విజ్ఞానం అందాలని, సమాజ వికాసం జరగాలని నమ్మిన గొప్ప ఆదర్శమూర్తి పూలే అని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయని, ఈ అవకాశాలను అందరూ అందిపుచ్చుకోవాలన్నారు. విద్య పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, పేద వర్గాలకు విద్యను అందించడంలో మన వంతు కృషి ఉండాలని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహనీయుల జీవిత చరిత్రను చదవడం లేదా త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే సరిపోదని, వారి ఆలోచనా విధానాన్ని ఎప్పుడైతే మనం ఆచరణలో పెడతామో అప్పుడే సార్థకత లభిస్తుందని అభిప్రాయపడ్డారు. గతంలో సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, ముఖ్యంగా మహిళల పట్ల ఉన్న వివక్షను ప్రస్తావిస్తూ, ఒకప్పుడు వితంతువుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేదని, శుభకార్యాలకు కూడా వారిని రానివ్వని దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతికి అనేక అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. బీసీ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లాలో త్వరలోనే 'బీసీ ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ హాల్స్' నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భవన నిర్మాణాలు లేని సంఘాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున మంజూరు చేస్తూ, స్థల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేసేలా చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సుకుమార్ పెటుకులే పూలే జీవిత చరిత్ర పై రచించి రూపొందించిన ఆడియోసిడిని కలెక్టర్, ఎంపి, ఎమ్మెల్యే ఆవిష్కరించి, వివిధ పాఠశాలల విద్యార్థులకు పూలే జీవిత చరిత్ర పై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు మెమెంటో, ప్రశంస పత్రాలను కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు. అంతకుముందు స్థానిక బిసి సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో, భుక్తాపూర్ లోని పూలే కూడలిలో, దస్నాపూర్ లోని బిసి స్టడీ సర్కిల్ ఆవరణలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా చిత్రపటాలకు, విగ్రహాలకు కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్, అధికారులు, కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బిసి సంక్షేమ అధికారి సోనియా, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత కుమారి, ఈడి మనోహర్, కౌన్సిలర్లు శ్రీనివాస్, స్వాతి, కుల సంఘాల నాయకులు దత్తు, సుకుమార్ పెట్కులే, మల్లేష్, గణేష్, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కారుణ్య నియామకాలు




అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ జిల్లాలో కారుణ్య నియామకాల కింద వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎంపికైన 16 మంది అభ్యర్థులకు ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉండి మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టిందని తెలిపారు. విధుల్లో చేరిన వారు అంకితభావంతో పనిచేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. అభ్యర్థులను 10 రెవెన్యూ , 2 సేల్స్ టాక్స్ , 1 వెల్ఫేర్ , 1 వైద్య శాఖ, 1 అకౌంట్స్, 1 ఇరిగేషన్ శాఖలకు కేటాయించగా, మొత్తం 15 జూనియర్ అసిస్టెంట్, ఒక ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు నియామక పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వర్ణ, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాలు




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో ఔషధ నియంత్రణపై నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంస పత్రాలను, బహుమతులను అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా. అంతకుముందు రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డి–అడిక్షన్ సెంటర్ లో అందిస్తున్న చికిత్సలను, వైద్యులను, రోగులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్రీలత, ఎస్ఐ సందీప్, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



అమృత్ తెలంగాణ ఇచ్చోడా న్యూస్ దళారులను నమ్మి మోసపోవద్దు నెరడిగొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో నిర్వహించిన నాఫెడ్ వారిచే తెలంగాణ రాష్ట్ర మార్కుఫెడ్ వారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ కుమారి మరియు ప్రజామిత్ర చనగల కొనుగోలు కేంద్రాన్ని శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని వారికి సహకరించాలని అన్నారు. ఎంతో కష్టపడి పండించే పంటలు తక్కువ ధరలకు అమ్మితే నష్టపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# సమానత్వంకై మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి చిరస్మరణీయం: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఏప్రిల్ 11, 2026: సామాజిక న్యాయం, విద్యా విస్తరణ, సమానత్వం కోసం మహాత్మ జ్యోతిబాపూలే చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, వివిధ శాఖల అధికారులు, బి.సి. సంఘాల ప్రతినిధులతో కలిసి మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, విద్యా విస్తరణ, సమానత్వం కోసం మహాత్మ జ్యోతిబాపూలే విశేష కృషి చేశారని తెలిపారు. పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అందించిన సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో సమానత్వం కోసం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ బి.సి. సంఘాల ప్రతినిధులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో సమానత్వం, కుల వివక్ష నిర్మూలన కోసం జ్యోతిరావు పూలే చేసిన పోరాటం మనకి నిత్యం స్ఫూర్తిని నింపాలి - డిసిసి కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమంలో బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అణగారిన వర్గాల కోసం కృషి చేసిన మహనీయులు గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ(డీసీసీ) కార్యాలయం లో జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఈ సందర్భంగా జ్యోతి బాపూలే దేశానికి చేసిన సేవలను కొనియాడుతూ నినాదాలు చేస్తూ వారిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బెజ్జంకి అనిల్ , గోలి సంజయ్, మంగేష్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల, మహిళల హక్కుల కోసం కృషి చేసిన ఆ మహనీయుడు మనకు ఎప్పటికీ ఆదర్శమన్నారు. సమాజంలో సమానత్వం, అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన జ్యోతిరావ్ పూలే ఆశయాలు ఆదర్శంగా తీసుకోని మనమంతా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

# రెండవ నిరుపేద మహిళ వివాహానికి అమ్మా చారిటబుల్ ట్రస్ట్ చేయూత



మెట్పల్లి అమృత్ తెలంగాణ ఏప్రిల్ 11: మెట్ పల్లి మండలం మేడిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న బిచ్చులా అంకిత కి వివాహం నిర్చయం అవగా తండ్రిని కోల్పోయి పేదరికంతో బాధపడుతున్న బిచ్చులా అంకిత గురించి ఆ ఏరియా ప్రజలు అమ్మా చారిటబుల్ ట్రస్ట్ దృష్టికి తీసుకురాగా 120 మందికి బోజనాలకు సరిపడా బియ్యం మరియు ఇతర వస్తువులతో పాటు పెళ్లి కూతురుకు పట్టు చీరని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పుల్ల శ్రీనివాస్ గౌడ్. శ్రీగద్దె రత్నాకర్. తారి రాజశేఖర్. చాకలి శంకర్, తరి లింగం, కుడిక్యాల సతీష్, గ్రామస్థులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ రఘు గారు



ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ ఏప్రిల్ 11: మండలం కేశాపూర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ కొండ నర్సాగౌడ్ కుమార్తె రుచిత – శ్రావణ్ గౌడ్ ల వివాహం సందర్భంగా నూతన వధూవరులను నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు ఆశీర్వదించారు.

కేశాపూర్ గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు కొండ మురళి గౌడ్ గారు, సీహెచ్ సత్యనారాయణ గౌడ్ , రేండ్ల రాజన్న గారు, నల్ల వెంకటేష్ వాల్గోట్ నరేష్ తదితరులున్నారు.

# జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు



మెట్ పల్లి అమృత్ తెలంగాణ ఏప్రిల్ 11:పట్టణంలో మహనీయుడు జ్యోతిరావు పూలే 199 వ జయంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ముదిరాజ్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ బాబు జిల్లా న్యాయ సలహాదారులు వెలుముల రాంబాబు అడ్వకేట్ , నియోజకవర్గ ఇన్చార్జి చెప్పురా అంజయ్య, కౌన్సిలర్ జక్కం బాబు , భూమయ్య మరియు సాగర్ , తోకల సత్యనారాయణ, చాలామంది ప్రముఖులు హాజరయ్యి జ్యోతిరావ్ పూలేకి ఘనంగా నివాళులర్పించినారు

# యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతికై అన్ని వర్గాల ప్రజలు పోరాడాలి

## అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్

అమృత్ తెలంగాణ ఏప్రిల్ 11 : ప్రపంచ శాంతి కోసం అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్ ఉన్నారు. వనపర్తి జిల్లా కమిటీ సమావేశం ఎత్తం శివ అధ్యక్షతన శనివారం లిటిల్ బర్డ్స్ స్కూల్ శనివారం సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి కె.వి.ఎల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కోరుకునే ప్రగతిశీలులు ఎవరి రాజకీయాలు వారికున్నప్పటికీ రాజకీయాలకు అతీతంగా ఏ.ఐ.పి.ఎస్.ఓ లో సభ్యులుగా చేరి ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకంగా సామ్రాజవాదానికి వ్యతిరేకంగా మానవజాతి ప్రగతి కోసం జరిగే ప్రపంచశాంతి ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే జయంతి





మాత్మ జ్యోతిబాపూ పూలే కు పూలమాల వేస్తున్న మాల సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మరియు సంఘం నాయకులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే జయంతి మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడుతూ .మహాత్మా జ్యోతిబాపూలే మహారాష్ట్రలోని సతారా జిల్లా లో ఏప్రిల్ 11వ తేదీ 1827 వ సంవత్సరంలో జన్మించారని తెలిపారు.బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే అని తెలిపారు. ఆ రోజులలో నిమ్న వర్గాలకు చదువుకోవడానికి అవకాశం లేదు. ఆడవారు ఇంటికే పరిమితం అనుకునే రోజులు. అలాంటి సందర్భంలో జ్యోతిబాపూలే తన భార్య అయిన సావిత్రి పూలే గని చదివించి, ఆడవారికి పాఠశాలను నెలకొల్పి చదువు చెప్పించిన మహానుభావుడు అని తెలిపారు. మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రి పూలే లు సామాజిక విముక్తి ప్రదాతలు అని తెలిపారు. వివక్ష, అజ్ఞానం మరియు స్త్రీ బానిసత్వానికి వ్యతిరేకంగా సాగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించి వారికి హక్కులు వచ్చేటట్లుగా పోరాటం చేశారని తెలిపారు.1848 ఆగస్టు 1వ తేదీన పూనే లోని భిడేవాడ లో తొలి బాలికల పాఠశాల ఏర్పాటు చేసి బాలికల విద్యకు పునాది వేశారని తెలిపారు. వారి అడుగుజాడల్లో మనమందరం నడవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ , జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న , వ్యవస్థాపక అధ్యక్షులు బేర దేవన్న జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పాశం రాఘవేంద్ర , సీనియర్ నాయకులు కన్వీనర్ సింగరి అశోక్ సీనియర్ నాయకులు మేదరి స్వామి తదితరులు పాల్గొన్నారు

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అవినీతి బయటపెడతాం

## జూన్ 23న సీఎం రేవంత్ రెడ్డి మిడ్జిల్ పర్యటన

## ఉమ్మడి మిడ్జిల్, ఉర్కొండ అభివృద్ధికి భారీ నిధులు



అమృత్ తెలంగాణ ఏప్రిల్ 11: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 65 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. జడ్చర్ల నియోజకవర్గంలో దాదాపు ప్రతి గ్రామానికి, తండాలకు బీటి రోడ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, త్రిబుల్ ఐటీ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేయడం ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 23న మిడ్జిల్ మండల కేంద్రానికి రానున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఆ రోజు మిడ్జిల్ మండలం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందుతుందని అన్నారు. ఉమ్మడి మిడ్జిల్, ఉర్కొండ మండలాల అభివృద్ధికి భారీ ఎత్తున నిధులను సీఎం మంజూరు చేస్తారని స్పష్టం చేశారు. అలాగే, మిడ్జిల్ మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంలో సుమారు 42 లక్షల రూపాయల అవినీతి జరిగిందని, ఉర్కొండలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నదని ఆరోపించారు. ఈ అంశంపై త్వరలోనే పూర్తి ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకువస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి అల్వాల్ రెడ్డి , ఎమ్మార్వో స్వప్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సామాజిక సంస్కర్త మహాత్మజ్యోతిరావు పూలే : సర్పంచ్ మంజులశ్రీనివాసులు



అమృత్ తెలంగాణ ఏప్రిల్ 11: కులం పేరుతో తరతరాలుగా అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన గొప్ప సామాజిక సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీరావ్ గోవిందరావు ఫులే అని.. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఊరుకొండ సర్పంచ్ మ్యాజల మంజులశ్రీనివాసులు అన్నారు. శనివారం ఊరుకొండ మండల కేంద్రంలో మండలంలోని ఆయా గ్రామాల్లో మహాత్మా జ్యోతీరావ్ గోవిందరావు ఫులే 199వ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఊరుకొండ మండల కేంద్రంలో నవభారతి అసోసియేషన్ ఊరుకొండ వారి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి గ్రామ మరియు మండల యువకులు మండల పెద్దలు ఊరుకొండ గ్రామ సర్పంచ్ మ్యాకల మంజులశ్రీనివాసులు, నవ భారతీ అసోసియేషన్ అధ్యక్షులు మ్యాకల శ్రీనివాసులు, మండల బిజెపి అధ్యక్షులు రాజేందర్ గౌడ్ తో పాటు వివిధ గ్రామాల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సందీప్ కుమార్, కిరణ్ కుమార్ నాయక్, కొమ్ము శ్రీను, హరీష్, గోపాల్, జంగయ్య, శ్రీశైలం, మహేష్, రమేష్ నాయక్, తిరుపతి, ఆనంద్, మరియు క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# రుహాని టాలెంట్ గుర్తించాల్సిందే..!



చి.ల.సౌ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భామ రుహాని శర్మ. ఆ సినిమాలో స్ట్రాంగ్ ఉమెన్ గా రుహాని నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఒక్క మూవీతోనే యూత్ లో రుహానికి మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇక ఆ తర్వాత రుహాని హిట్ సినిమాలో కూడ నటించింది. శైలేశ్ డైరక్షన్ లో విశ్వక్ సేన్ హీరోగా వచ్చిన హిట్ మూవీ కూడా అమ్మడి ఖాతాలో మరో హిట్ పడేలా చేసింది. ఆ తర్వాత డర్టీ హరి నూటొక్క జిల్లాల అందగాడు సినిమాల్లో కూడా నటించింది ఈ భామ. ఇక్కడే కాకుండా బాలీవుడ్ లో మ్యూజిక్ వీడియోలో కూడా రుహాని అదరగొట్టేసింది. ప్రస్తుతం ఆగ్రా మీట్ క్యూట్ సినిమాల్లో నటిస్తున్న రుహాని శర్మ గ్లామర్ షో చేయడంలో మాత్రం వెనకడుగు వెయట్లేదు. అమ్మడు చేస్తున్న ఈ షోకి రోజు రోజుకి తన ఫాలోవర్స్ పెరుగుతూ వస్తున్నారు. స్కిన్ షోలో నావెల్టీని జోడీస్తూ రుహాని చేస్తున్న ఫోటో షూట్ కి ప్రత్యేక ఆకర్షణ అవుతున్నారు నెటిజెన్లు. అంతేకాదు లేటెస్ట్ గా ఓ సాంగ్ కి డ్యాన్స్ చేస్తూ వీడియో చేసింది అమ్మడు. ఆ వీడియోని తన ఇన్ స్టా రీల్స్ లో షేర్ చేసింది. ఛాన్స్ దొరికితే ఎలాగోలా ప్రేక్షకులను మెప్పించాలని చూస్తున్న రుహాని శర్మ ప్రయత్నాలు వర్క్ అవుట్ అవుతున్నాయని చెప్పొచ్చు. అందం అభినయం రెండు కలగలిపి ఉన్న రుహానికి ఇంకా ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదని చెప్పొచ్చు. తనకి ఇచ్చిన పాత్రలో మెప్పిస్తూ వస్తున్న రుహాని శర్మ స్టార్ సినిమా ఛాన్సుల కోసం ఎదురుచూస్తుంది. లేటెస్ట్ ఇన్ స్టా రీల్స్ తో సోషల్ మీడియాలో వైరల్ గా మారిన రుహాని శర్మ.

# ఈ వెయిటింగ్ దేనికోసం అమ్మడు..?



రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మృణాల్ అదరగొట్టగా ఇక టాలీవుడ్ లో అమ్మడికి తిరుగులేదని అనుకున్నారు. సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మెప్పించిన బ్యూటీ మృణాల్ ఠాకూర్ అంతకుముందు బాలీవుడ్ సీరియల్స్ తో పాటు సినిమాలు కూడా చేసినా రాని క్రేజ్ అమ్మడికి సీతారామం తో వచ్చింది. సినిమాలో సీతామహాలక్ష్మి, నూర్జహాన్ పాత్రల్లో మృణాల్ అదరగొట్టేసింది. టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చిందని అందరు ఫిక్స్ అయ్యారు. సీతారామం తర్వాత నానితో హాయ్ నాన్న సినిమా చేసింది అమ్మడు. ఆ సినిమాలో కూడా తన నటనతో ఇంప్రెస్ చేసింది. రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మృణాల్ అదరగొట్టగా ఇక టాలీవుడ్ లో అమ్మడికి తిరుగులేదని అనుకున్నారు. సూపర్ ఛాన్స్ కొట్టేసిన శివానీ కానీ విజయ్ దేవరకొండతో చేసిన ఫ్యామిలీ స్టార్ సినిమా డిజప్పాయింట్ చేసింది. ఆ సినిమా హిట్ అయితే పరిస్థితి ఎలా ఉండేదో కానీ ఆ సినిమా ఫ్లాప్ అవ్వడం వల్ల మృణాల్ కెరీర్ రిస్క్ లో పడింది. రెండు హిట్లు పడినప్పుడు కాదు ఒక్క ఫ్లాప్ పడగానే బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అందుకే తెలుగులో అమ్మడికి చేతిదాకా వచ్చిన సినిమాలు చేజారిపోయాయి. పోనీ బాలీవుడ్ లో ఏమైనా వరుస ఆఫర్లు ఉన్నాయా అంటే అక్కడ అరకొర అవకాశాలే తప్ప పెద్దగా ఛాన్స్ లు రావట్లేదు. ఐతే తెలుగులో కొన్ని ఆఫర్లు వస్తున్నా కూడా మృణాల్ వాటిని వెయిటింగ్ లో పెట్టినట్టు తెలుస్తుంది. మరి కెరీర్ అటు ఇటుగా ఉన్నప్పుడు కూడా ఈ వెయిటింగ్ లు గట్రా దేనికన్నది అర్థం కావట్లేదు. ఐతే ఒక ఆఫర్ కి ఓకే చెప్పాక దానికంటే బెటర్ ఆఫర్ వస్తే కష్టం కదా అని మృణాల్ భావిస్తుంది. ఐతే అలా వెయిట్ చేస్తూ ఆఫర్లను హోల్డ్ లో పెడుతూ వస్తే ఇక ఉన్న ఆ ఒక్క ఛాన్స్ కూడా చేజారే అవకాశం ఉంటుంది. కథల విషయంలో నచ్చక వెయిట్ చేయడం మంచి విధానమే కానీ మరీ మృణాల్ ఠాకూర్ ఇలా రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగానే డీలా పడిపోవడం ఆమె ఫ్యాన్స్ ని కన్ ఫ్యూజ్ చేస్తుంది. మృణాల్ మళ్లీ తిరిగి తెలుగులో వరుస సినిమాలు చేయాలని ఆమె ఫాలోవర్స్ కోరుతున్నారు. ఐతే సినిమాల పరంగా దూరంగా ఉంటున్నా అమ్మడు ఫోటో షూట్స్ తో ఆడియన్స్ కు రెగ్యులర్ గా టచ్ లోనే ఉంటుంది. తప్పకుండా మృణాల్ కి మళ్లీ మంచి అవకాశాలు రావాలని ఆమె ని ఇష్టపడే ఆడియన్స్ కోరుతున్నారు.

# అమ్మకు అచ్చు గుద్దిన అందం హీరోయిన్గా!



కోలీవుడ్ లో ఇప్పటికే మామ్ క్రేజ్ తో కొంత మంది భామలు హీరోయిన్లగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కోలీవుడ్ లో ఇప్పటికే మామ్ క్రేజ్ తో కొంత మంది భామలు హీరోయిన్లగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రాధ కుమార్తెలిద్దరు కార్తీక, తులసి ఇద్దరు ఎంట్రీ ఇచ్చారు. కానీ ఇండస్ట్రీలో వాళ్లు సక్సెస్ కాలేదు. కొన్ని సినిమాలు చేసి వెనుదిరిగారు. అలాగే యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య కూడా లాంచ్ అయింది. కానీ ఆమె కూడా నిలదొక్కుకోలేకపోయింది. వివాహం చేసుకుని ఓఇంటిదైంది. కార్తిక కూడా పెళ్లి చేసుకుని స్థిరపడింది. ఇలా కెలికితే కొంత మంది భామల పేర్లు తెరపైకి వస్తాయి. అయితే ఇప్పుడా సెంటిమెంట్ ని బ్రేక్ చేస్తూ ముందకు సాగాల్సిన బాధ్యత ఈ నయ వారసురాళ్లపై ఉంది. సుందర్ .సి-ఖుష్బూలకు ఇద్దరు అందమైన కుమార్తెలు అవంతిక, ఆనందిత ఉన్నారు. అవంతిక అయితే అచ్చంగా అమ్మనే పోలి ఉంటుంది. ఖుష్బూ నోట్లో నుంచి ఊడిపడినట్లే ఉంటుంది. ఇటీవలే ఇద్దరు చదువులు కూడా పూర్తి చేసారు. ఈ నేపథ్యంలో అవంతిక మ్యాకప్ వేసుకోవడానికి రెడీ అవుతోంది. తాజాగా అమ్మడు ఓ ఫోటోషూట్ లో పాల్గొంది. బ్రౌన్ కలర్ బ్లౌజ్ పై షర్ట్ ధరించి నేలపై కూర్చుని కెమారాకి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. కవ్వించే కిల్లర్ లుక్ లో కట్టిపడేసింది. అమ్మడి ఎదపై సొగసైన టాటూ తో వావ్ అనిపించింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



అన్వేషి జైన్ హాట్ ఇన్ వైట్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com